


# కాలమ్ దాటని కబుర్లు

బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### ఇస్కూళ్ళ ఇన్‌స్పెక్టర్

**ముందురోజే క్లాస్** రూంలో బోర్డ్‌లన్నీ బొగ్గూ, ఉమ్మెత్త ఆకులూ నూరి, నల్లగా నున్నగా మెరిసిపోయేట్లు చేసాడు సందానీ. ఆ రోజు వుతికిన స్కూల్ డ్రెస్ వేసుకున్నాడు. లాగూకి బొత్తాలున్నాయి. చెంపలమీదకి జారేట్లు నూనె రాసుకున్నాడు. బుగ్గలకి పేస్తర్లుగా పౌడర్ అద్దుకున్నాడు. కాళ్ళకి పిన్నీసులు పెట్టని హవాయి చెప్పులు వేసుకున్నాడు, పుస్తకాల సంచి భుజానికి తగిలించుకున్నాడు.

"ఏవీ రమణీ" అని పొద్దుటే వచ్చేసాడు.

నేను ఆశ్చర్యంగా చూసాను. వీడికి ఇంత నీట్‌నెస్ ఏవిటా అని.

"ఈదినం ఇస్కూల్‌కి ఇన్‌స్పెక్టర్ వస్తాడు తెలుసా?" అన్నాడు.

"అయితే?" అన్నాను.

సందానీ మొహం వెలిగిపోతోంది. "దినాం ఆ మమతా టీచర్ మనకి టైంకి రావాల.. ఎక్కాలు అప్పజెప్పాలి. నీట్‌గా తల దువ్వాల, పుస్కాలు మంచిగ పెట్టుకోవాల.. గివన్నీ సెప్తది కదా! గీ దినం ఆమె ఎట్ల పరుగులు పెడ్తా టైం కొస్తదో సూద్దాం" అన్నాడు కాలర్ కొంచెం ఎగరేసి,

నాకూ ఉషారొచ్చింది. గబగబా తయ్యారయి స్కూల్‌కి బయల్దేరాం.

టీచర్లు అంతా ప్రేయర్‌కి గ్రౌండ్‌లో నిలబడ్డారు. అలవాటుగా మమతా టీచర్, నారాయణ సార్, అవాంజలీనా టీచర్, నీలాద్రి సార్ ఇంకా రాలేదు. గంట గణగణా మోగింది.

మేమంతా "ఇండియా ఈజ్ మై కంట్రీ" చదువుతుండగానే ఇన్‌స్పెక్టర్ వచ్చేసారు. తర్వాత 'జనగణమన' పాడాం.

ఇన్‌స్పెక్టర్ అంటే సూటూ, బూటూ, హేటూ ఉంటుంది అనుకున్నా. కానీ పంచె, లాల్చీ, పైన ఉత్తరీయం వేసుకున్నారు ఆయన. మొహాన నామం పెట్టుకున్నారు.

"ఇన్‌స్పెక్టర్ అంటే కాకీ బట్టలూ, పిస్టల్ లేవే?" అన్నాడు గుసగుసగా శీనుగాడు నాతో.

"ఆ సినిమాల్లోలా 'యూ ఆర్ అండర్ అరెస్ట్' అనే ఇన్‌స్పెక్టర్ కాదురా స్కూళ్ళ ఇన్ స్పెక్టర్ అంటే" అన్నాను.

"ష్..హూ ఈజ్ దట్ స్పీకింగ్?" రాణీ టీచర్ అరిచింది.

ఇన్స్పెక్టర్‌కి టీచర్లు అందరూ ఒంగి ఒంగి దణ్ణాలు పెట్టారు. ఆయన రిజిస్టర్ అడిగి "ఎంత మంది టీచర్లు ఫుల్‌స్ట్రెంత్?" అన్నారు.

"ఇరవైమంది సార్" రంగనాథం సార్ చెప్పారు.

ఆయన అక్కడున్న వాళ్ళని కళ్ళతోనే లెక్క కట్టి "మరి పదమూడు మందే వున్నారా?" అన్నారు.

"ఫస్టు బెల్ అయ్యాక వస్తారు సార్" సందానీ అన్నాడు.

ఆయన దృష్టి వాడిమీద పడింది.

"ఇటు రారా" అన్నారు. సందానీ స్టేజ్ ఎక్కాడు. మొదటిసారి స్టేజ్ ఎక్కుతూ, భరతనాట్యం అరంగేట్రం చేసేవాడిలా వాడు మురిసిపోయాడు.

"ఏ ఏ టీచర్లు ఆలస్యంగా వస్తారురా?" ఆయన అడిగాడు.

సందానీ వేళ్ళు ముడుస్తూ "అంవేజిలీనా టీచర్, ఫిలోమినా టీచర్, మమతా టీచర్, తిమోతీ సార్" అంటుంటే, రోజూ ఆలశ్యంగా వచ్చే హేమలతా టీచర్‌కీ, మార్త ప్రభూ టీచర్‌కీ వాళ్ళ పేర్లు చెప్పేస్తాడేమోనని తెగ చెమట్లు కారిపోతున్నాయి.

ఆయన రిజిస్టర్‌లో ఆ పేర్ల ముందు టిక్ చేసుకుని "మీ టాయ్‌లెట్స్ ఎలా వుంటాయిరా?" అని అడిగారు.

సందానీ వెంటనే ముక్కు మూసుకుని, "ఆ వాసన మీరు భరించలేరు సార్. నీళ్ళు పోద్దాం అంటే నీళ్ళు కూడా నల్లాలకెల్ల రావుసార్. అస్సలు సాఫ్ చెయ్యరు. నిన్న మీరు ఇవాళ వస్తారని డీడీటీ కొట్టిపించి, కడిగిపించిను సార్" అన్నాడు.

హెడ్ మాస్టర్ బైక్ సరిగ్గా ఆపకుండానే దాని మీద నుండి గెంతి, వురుకులూ, పరుగులూ మీద వస్తూ "నమస్కారం.. నమస్కారం.. నమస్కారం సార్" అన్నాడు.

ఇన్స్పెక్టర్ గారు వాచ్ వైపూ, ఆయన వైపూ చూసారు.

"సార్.. హెడ్ ఆఫ్ ది ఇనిస్టిట్యూషన్ మీరు. మీరే ఇలా ఆలశ్యంగా వస్తే ఆ టీచర్లు చూడండి. ప్రేయర్ అయినా ఇంకా రాలేదు" అన్నారు ఘాటుగా.

"సార్.. మార్కెట్‌లో నుండి వస్తూ వుంటే, బర్రెలు అడ్డం వచ్చాయి సార్. నేను సెరిగ్గ పూడుస్తనే వున్నా. శీఘ్రం రాడానికే ట్రై పణ్ణా" అని అరవ తెలుగులో చెప్తుంటే,

"పిల్లల ముందు మీరు ఇలా బర్రె అడ్డం వచ్చిందీ, గొర్రె అడ్డం వచ్చింది అని కారణాలు చెపితే ఇంక వాళ్ళేం నేర్చుకుంటారు సార్?" అన్నారు విసుగ్గా ఇన్స్పెక్టర్.

"నాదీ నాయనకీ కాలు ఇరిగింది. దవాఖానాకి పోయి వస్తే లేట్ అయింది అంటే ఇంత పెద్ద కర్రతో, గేట్ దగ్గర నిలబడి కొడ్తాయి. సారె నాకీ" సందానీ ఎంత పొడుగు కర్రో చేత్తో సాగదీసి చూపిస్తూ అన్నాడు.

"పిల్లలని కొడ్తారా?" ఇన్స్పెక్టర్ అడిగాడు.

"ఏదో కాస్తభయం ఉండాలని చిన్నగా" అని హెడ్ మాస్టర్ సందానీ కేసి గుడ్లెర్రజేస్తూ చూసారు.

"మా పి.టి సార్, చేతితో కొడితే తోలు లేచి పోతది సార్. మమతా టీచర్ తొడమీద తొడ పాశం పెడితే మూడు దినాలు మరకపోదు సార్. లెక్కల సార్ ఆడపిల్లలకి కొట్టడు సార్" అని లెక్కల సార్ చిన్నగా నవ్వి ఒంకర్లు పోతుండగా "పెద్ద కిలాస్ అక్కలకి ముద్దులు పెడ్తయి సార్" అన్నాడు.

అంతే అండ పిండ బ్రహ్మాండం బద్దలయినట్లు ఇన్స్పెక్టర్ గారు "ఆ?" అని హూంకరించారు.

లెక్కల సార్ కి ప్యాంట్ తడిసిపోయినంత పనైపోయింది. హెడ్ మాస్టర్ "మురుగా..మురుగా" అని సందానీ భుజం పట్టి నొక్కి స్టేజ్ దింపే ప్రయ త్నం చేస్తూ "అదేంలేదు సార్. వాడికి తెలుగు సరిగ్గా రాదు. ఏదో మాట్లాడి పూడుస్తున్నాడు. నువ్వు పోరా" అన్నారు.

ఇన్స్పెక్టర్ కోపంగా "మీ తెలుగు కన్నా బాగానే వుంది వాడి తెలుగు. మీకు ఆడపిల్లలున్నారా?" అని అడిగారు.

"ముగ్గురు ఆండ బిడ్డలు సార్" అన్నాడు హెడ్ మాస్టర్.

"ఈ స్కూల్‌లోనే చదువుతున్నారా?"

"లేదు సార్. కాన్వెంట్‌ల దా ఏసినాను"

"ఏం? ఇక్కడ అయితే పి.టిసార్ కొడ్తాడూ, మేత్స్ సార్ ముద్దులు పెడ్తాడు అనా?" వురిమినట్లు అడిగారు. హెడ్ మాస్టర్ చెంపలు వేసుకుంటూ "మురుగా.. మురుగా" అని నసిగాడు.

"ఏంటయ్యా ఇదీ? ఆడపిల్లలని కొట్టడానికీ, ముట్టుకోడానికీ మగటీచర్లకి రైట్ లేదు" అంటూ వుండగా, పట్టుచీర కట్టుకుని, మొహానికి దట్టంగా పౌడర్ పూసుకుని వయొలెట్ కలర్ పట్టు చీరలో, ఆపసోపాలు పడ్తూ "నమస్తే సార్" అని రెండు చేతులూ జోడిస్తూ మమతా టీచర్ వచ్చింది.

ఇన్స్పెక్టర్ ఆవిడకి తన రిస్ట్ వాచ్ చూపిస్తూ "ఏమ్మా స్కూల్ మీకు పదింటికి స్టార్ట్ అవుతుందా?" అన్నారు.

"సార్.. వచ్చాను సార్.. స్టాఫ్ రూంలో కెళ్ళి" అంటుంటే,

"స్టాఫ్ రూంలో టీచర్లు గప్పాలు కొడ్తారు సార్. కిలాస్‌కి దబ్బున రారు గీ మమత టీచర్ అయితే, రెండు మూడు స్వెట్టర్లు గీడనే అల్లింది, వైరు బుట్టలు కూడా. మల్ల మొకాలు కడుగుడూ, పౌడర్లు అద్దుడూ" అన్నాడు సందానీ.

సందానీ అంత తెల్లారే పెళ్ళికొడుకులా తయ్యారయ్యి, ఎందుకొచ్చాడో నాకు అర్థమయింది. "ఈ టీచర్ నాకీ దినాం, నీల్ డన్ చేపిస్తది సార్. తొడపాశం పెట్టి పెట్టి గిడ మరకపడిపోయింది సార్.." వాడి లాగూ పైకి జరిపి తెల్లని తొడమీద నల్లని మచ్చ చూపించాడు.

"నాదీ చెవి పి.టీ సార్ నలిపి, నలిపి ఎర్రగైపోయింది సార్" అన్ని రంగులూ చెప్పేస్తున్నాడు.

మమతా టీచర్ సందానీ వైపు వేలు చూపించి "ఒరేయ్ చదువుకోవు వెధవా. నా మీద ఇన్ని నేరాలు చెప్తావా?" అంది.

"వెయిట్ టీచర్. వెధవా అనే హక్కు మీకెవరిచ్చారు? చిన్నపిల్లాడే కావచ్చు అయినా అలాంటి మాటలు మీరు అంటే, వాళ్ళూ అదే నేర్చుకుంటారు. మీకే మేనర్స్ లేదు. మాట్లాడ్డం రాదు టైంకి రారు. వాళ్ళకి చదువురావాలంటే, మీరు చెప్పాలిగా?" అన్నారు ఇన్స్పెక్టర్.

సందానీ వెంటనే "సదువు సెప్పరు సార్, వీళ్ళ ఇంటికాడ టూసన్ సదివే పిల్లలకే సెప్తారు. నేను టూసన్‌కి పోతే, మా అమ్మీజాన్ జీతం ఇస్తలేదని, ఇంటిముందు గోబర్ ఎత్తిపించి, జల్లిపించింది. కిస్మిస్ టీచర్ ఇంటిముందు రోడ్డంత ఊడిపిస్తది. లేదా దుక్నానికి పోయి ఉప్పుసేపా, చాపత్తా, షక్కెర్ తెమ్మంటరు. పాపం ఏ.వీ రమణీకి ఉప్పుశాప తెమ్మంటే, ఆమెకీ వాళ్ళ అమ్మమ్మ నెత్తిమీద కెల్లి నీళ్ళు పోసి, ఎండల నిలబెట్టింది వాళ్ళు చాపలు తినరు సార్. పప్పు తింటరు" అని నా సంగతి కూడా చెప్పేసాడు.

నేను తలవంచుకున్నాను. మనసులో కిస్మిస్ టీచర్ అనబడే క్రీస్తుమణీ టీచర్‌కి బ్యాండ్ బజాయిస్తారు ఇన్స్పెక్టర్ అని ఉషారొచ్చింది.

"ఇదా మీరు పాఠాలు చెప్పమంటే చేసే పనీ? ఇక్కడ జీతాలు తీసుకుంటూ, ఇంటివద్ద ట్యూషన్లా? జీతాలు ఇవ్వలేని పిల్లల చేత బాండెడ్ లేబర్ చేయిస్తున్నారా? ఏవయ్యా సంతానం?"

హెడ్ మాస్టర్ కళ్ళు మూసేసుకున్నాడు.

"ఇంతకాలం కళ్ళు మూసుకున్నది చాలు. ఇకనైనా కళ్ళు తెరవయ్యా. చూడు పిల్లలకి మేనర్స్ నేర్పాల్సిన టీచర్ నా ముందే 'వెధవా' అని తిడ్తోంది. ఆడపిల్లలకి ముద్దులు పెడ్తాడుట ఇంకో సార్. ఇంట్లో పాచిపనులు చేయిస్తోందిట ఇంకో టీచర్."

"కిస్‌మిస్ టీచర్... అదిగో తెల్లచీర కట్టుకుని, కనకాంబరం పువ్వులు పెట్టుకుంది అవీ కాగితం పూలు సార్. దినాం పెట్టుకుంటది" సందానీగాడి వుక్రోషం ఆగేట్టు లేదు.

"నన్ను నీల్ డౌన్ చేసి చేసి మోకాళ్ళకే చెప్పులు వేసుకుంటున్నాను సార్" అన్నాడు.

"ఏవమ్మా కిస్‌మిస్ ముందుకిరా" అన్నాడాయన.

"నా పేరు క్రీస్తుమణి అండీ" ఆవిడ సిగ్గుపడిపోతూ ముందుకొచ్చింది.

"ఏదో ఒకటి. పిల్లలని నీల్‌డౌన్‌లు చేయించడం. ఉప్పు చాపలు తెప్పించుకోవడం కాకుండా మీరు ఇంకా ఏమేం చేస్తూ వుంటారు? మీ సబ్జెక్ట్ ఏవిటి?" అన్నారాయన.

"ఇంగ్లీష్  సార్" అందావిడ.

"గూస్ అంటే గుడ్లగూబ అని చెప్పారట.. ఔనా? ఓ పేరెంట్ కంప్లైంటు ఇచ్చారు" అన్నారు.

ఆవిడ గుండె గుభేలుమని చూసింది. ఎందుకంటే, ఆవిడ "గూస్ అంటే గుడ్లగూబ" అని చెప్తుంటే, అటుగా వెళ్తున్న మా అమ్మమ్మ క్లాస్‌లో కొచ్చి "అమ్మా గూస్ అంటే బాతు, ఔల్ అంటే గుడ్లగూబ. సాయంత్రాలు నా దగ్గరకి రా. కాస్త చదువు చెప్తా" అని క్లాస్ పీకింది. అమ్మమ్మ ఆ కాలంలో పి.యూసి చదివింది మరి. రెన్ అండ్ మార్టిన్ గ్రామర్ ఆవిడకి కంఠతా వచ్చు 'కీ'తో సహా. అందుకే నా వైపు కోపంగా చూసి "సార్.. ఏదో తొందరలో" అని నసిగింది.

"మీరు వారానికి మూడు రోజులు వస్తే కూడా హెడ్‌మాస్టర్ ఏమీ అనరటగా. లీవ్ మెమోకూడా పంపించకుండా. ఏవిటి అంత ప్రత్యేకత?" ఇన్‌స్పెక్టర్ గారి ప్రశ్నలకి మా సంతానం సార్‌కి ధారగా ముచ్చెమటలు కారిపోతున్నాయి.

ఇవన్నీ గొప్ప వినోదంగా చూస్తున్నది మాత్రం రంగనాథం సార్ మా చిన్న తెలుగు పండిట్. వాళ్ళిద్దరూ టైం కొస్తారు. మమ్మల్ని ప్రేమగా చూసేవారు. అంతో ఇంతో చదువొచ్చింది అంటే వాళ్ళ వల్లే. ఇతర మాస్టర్లనీ టీచర్లనీ చూసి బాధపడినా పాపం ఏవీ చెయ్యలేరు కదా! అందుకే ఇంటిగుట్టు విప్పిన చిన్న విభీషణుడిలా కనిపించాడు సందానీ వాళ్ళకి ఆరోజు.

ఇన్‌స్పెక్టర్‌గారు జేబులోంచి ఓ చాక్లెట్ తీసి సందానీకిచ్చి "నువ్వెళ్ళు బాబూ. పిల్లలంతా క్లాసులకి వెళ్ళండి. టీచర్లు అంతా నాతో రండి" అని ఆఫీస్ రూంలోకి నడిచారు.

ఆ సాయంత్రం సందానీ సంచిలో చాలా కాయితం వుండలు దొరికాయి. ఒకటి సాఫ్ చేసి చదివాను "సార్.. నమస్కారం. నాకీ పేరు సందానీ. మాదీ ఇస్కూల్‌కి మీరు రావాల. మాదీ సార్లు సదువు సెప్పరు. బాగా కర్రలు ఇరిగేట్లు కొడ్తరు. మీకు సలాం వాలేకుమ్.. సందాని" అని మా స్కూల్ పేరు రాసాడు.

"ఏవిట్రా ఇవీ?" అన్నాను.


"నేనే చాలా చీటీలు రాసి చింపేసి, ఒకటి మీ అమ్మమ్మ సేత కరెట్‌క రాపించి, ఇన్‌స్పెక్టర్ సార్ ఇల్లు కనుక్కుని పోయి, వాళ్ళ పెళ్ళాం మేడంకి ఇచ్చి వచ్చిన" అని ముసిముసిగా నవ్వాడు.

అమ్మమ్మ కూడా వాడితో భాగస్వామి అని తెలిసి ఇంకా ఆశ్చర్యపోయాను.

మొత్తానికి ఆ తర్వాత స్కూల్ అంతా మారిపోయింది అని చెప్పలేను కానీ, టీచర్లు కొంత భయపడడం, బాత్‌రూంలు క్లీన్ చేయించడం, శుభ్రమైన త్రాగునీరు రావటం, టీచర్లు టైంకి రావడం, కొట్టడం తగ్గించడం చేసారు.

ఇప్పటికీ కొన్ని స్కూళ్ళల్లో ఇవే పరిస్థితులు వున్నాయని విన్నప్పుడు బాధేస్తుంది. ప్రతి బడికీ సందానీ వుండడుగా మరి.

Post your comments










https://www.youtube.com/watch?v=ERaaX_IuIS4